క్లుప్తంగా

తహసీల్దార్‌కు సన్మానం



తహసీల్దార్ రత్న రాధికను సన్మానించిన ఆర్డీఓ, సిబ్బంది

కూడేరు: ఎన్నికల నిర్వాహణలో, మండల ప్రజల, రైతుల సమస్యల పరిష్కారంలో తహసీల్దార్ రత్న రాధిక అందించిన సేవలు అభినందనీయమని గుంతకలు ఆర్డీఓ శ్రీనివాసులు కొనియాడారు. తహసీల్దార్ రత్న రాధిక సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా నంద్యాల జిల్లా నుంచి బదిలీపై మండలానికి వచ్చారు. ఎన్నికలు ముగియడంతో తిరిగి సొంత జిల్లాకు ఉన్నతాధికారులు బదిలీ చేశారు. బుధవారం ఆమెకు కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. శాలువాలు కప్పి పూలమాలలతో సత్కరించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ విశ్వనాథ్, ఏఎస్ఓ ఆశ, ఆర్ఐ ప్రసన్న కుమార్, వీఆర్వోలు సాయి, గోపాల్, రుక్మిణి, నరసయ్య, సర్వేయర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

దూరవిద్య డిగ్రీ కోర్సులకు అడ్మిషన్లు

రాయదుర్గం: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ దూర విద్య ద్వారా బీఏ, బీకామ్, బీబీఏ అన్ని గ్రూపుల్లో ప్రవేశాలకు అడ్మిషన్లు జరుగుతున్నాయని ఏజెంట్ షోయబ్ తెలిపారు. ఇంటర్ పాసై కళాశాల మానేసిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం 86396 25668, 83330 85320 నంబర్లలో సంప్రదించాలన్నారు.

అక్రమ లేఅవుట్లపై ఫిర్యాదు

రాయదుర్గం: పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన అక్రమ లేఅవుట్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ కిషోర్‌ను వైస్ చైర్మన్ శ్రీనివాస్‌యాదవ్, కౌన్సిలర్లు బండి అజయ్, డిష్ గోవిందు, శ్రీనివాసరెడ్డి, వార్డు ఇన్‌చార్జ్ గంగాధర కోరారు. ఈ మేరకు బుధవారం వారు కమిషనర్‌కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ 12, 14 వార్డుల్లో కొంతమంది వ్యవసాయ భూమిని వ్యవసాయేతరం కింద మార్చకుండా లే అవుట్లు వేసి ప్లాట్ల అమ్మకాలు చేపట్టారని ఆరోపించారు.

ఆలయంలోకి మురుగు నీరు



కళ్యాణదుర్గం: పట్టణంలోని స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లే రహదారిలో ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలోకి రోజూ మురుగు నీరు వచ్చి చేరుతోంది. పక్కనే ఉన్న డ్రైనేజీ నిండి మురుగునీరు ఆలయంలోకి చేరుతోంది. అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఆదర్శ పాఠశాల తనిఖీ

కూడేరు: వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నేత క్రిష్ణమూర్తి ఇటీవల కలెక్టర్ వినోద్ కుమార్‌ను కలిసి కూడేరులోని ఎమ్మార్సీ ఆవరణలో ఉన్న ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో, కమ్మూరుతో పాటు మరో గ్రామంలోని పాఠశాలలో నాడు–నేడు కింద చేపట్టిన పనుల్లో అక్రమాలు చోటు చేసుకున్నాయని ఫిర్యాదు చేశారు. కలెక్టర్ విచారణకు ఆదేశించడంతో బుధవారం సాయంత్రం డీఈఓ వరలక్ష్మి ఆదర్శ పాఠశాలను సందర్శించారు. అక్కడి పనులను పరిశీలించి ఎంఈఓ చంద్రశేఖర్‌తో విచారణ చేపట్టారు.

పింఛన్లు సజావుగా జరగాలి

కళ్యాణదుర్గం రూరల్: నియోజకవర్గం వ్యాప్తంగా పింఛన్ల పంపిణీ కార్యక్రమం సజావుగా నిర్వహించాలని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అధికారులకు సూచించారు. బుధవారం స్థానిక ప్రజావేదిక వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. తొలిరోజు వందశాతం పంపిణీ పూర్తి చేయాలన్నారు. అందుబాటులోని వారికి మరుసటి రోజు ఇవ్వాలన్నారు.

మెనూ ప్రకారం భోజనం పెట్టాలి

కంబదూరు: విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఏబీఎస్ఎఫ్ డివిజన్ కార్యదర్శి వెంకటేశులు డిమాండ్ చేశారు. బుధవారం కంబదూరు కేజీబీవీని సందర్శించారు. అక్కడి విద్యార్థినులతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

ఘనంగా కేవీకే స్వర్ణోత్సవాలు



మాట్లాడుతున్న శాస్త్రవేత్త మల్లేశ్వరి

కళ్యాణదుర్గం రూరల్: స్థానిక కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)లో స్వర్ణోత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. రెడ్డిపల్లి కేవీకే ప్రధాన శాస్త్రవేత్త ఎస్ఎన్ మల్లేశ్వరి హాజరయ్యారు. కళ్యాణదుర్గం కేవీకే ప్రధాన శాస్త్రవేత్త రాధాకుమారి మాట్లాడుతూ కేవీకే ద్వారా రైతులకు పంటల సాగులో అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వడంతోపాటు నూతన వంగడాలు పరిచయం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు యుగంధర్, మల్లికార్జున, హరిణి, శిరీష, రైతుల పాల్గొన్నారు.

భౌ భౌ..



రాయదుర్గంలో రెండు రోజుల క్రితం రాత్రి వేళ ట్యూషన్ ముగించుకుని సైకిల్‌పై ఇంటికి వెళ్తున్న ఏడో తరగతి విద్యార్థినిపై రైల్వే ట్రాక్ సమీపాన కుక్కల గుంపు ఒక్కసారిగా దాడి చేసింది. విద్యార్థిని సైకిల్ పడేసి ప్రాణభయంతో పరుగులు తీసింది. అయినా వెంటపడుతున్న కుక్కలను ఎదురుగా వచ్చిన ఓ ద్విచక్రవాహన దారుడు గమనించి రక్షించాడు. చదం గ్రామంలో పవన్ అనే యువకుడిపై కుక్కదాడి చేసి గాయపరిచింది. ఇలా ఈ రెండు చోట్లే కాదు కుక్కకాటు బాధితుల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతుండటం ఆందోళన కలిగిస్తోంది.

3 నెలల్లో 740 కేసులు

- రెచ్చిపోతున్న వీధి కుక్కలు
- పెరుగుతున్న కుక్కకాటు బాధితులు
- నియంత్రణపై కనిపించని చర్యలు

రాయదుర్గం: మొరిగే కుక్క కరవదని అంటారు. అది ఒకప్పటి మాట. ఇప్పుడు మొరగని కుక్కతో పాటు మొరిగే కుక్క సైతం పిక్కలు పట్టుకుని పీకుతున్నాయి. రాత్రి, పగలు అనే తేడా లేకుండా వెంటాడి కరుస్తున్నాయి. పాదచారులు, వాహనదారులు, చిన్న, పెద్ద అనే తేడా లేకుండా దాడి చేస్తున్నాయి. రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకర్గాల్లో గడిచిన మూడు (మే, జూన్, జూలై) నెలల్లో 740 కుక్కకాట్లు నమోదయ్యాయి. ఇందులో అత్యధికంగా 494 కేసులు ఒక్క రాయదుర్గం నియోజకవర్గంలోనే నమోదు కావడం విశేషం.

బెంబేలెత్తుతున్న ప్రజలు

రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో పెంపుడు కుక్కలతో పాటు వీధి కుక్కల సంతతి గణనీయంగా పెరిగింది. ఈ నేపథ్యంలో రాత్రి అయ్యేసరికి రోడ్డు మీద ప్రయాణం ఇబ్బందికరంగా మారుతోంది. వీధి కుక్కలను నియంత్రించాల్సిన అధికారులు నామ మాత్రపు చర్యలతో సరిపెడుతున్నారు. ఇటీవల రేబిస్ టీకాలు పెంపుడు కుక్కలకు మాత్రమే వేసి.. వీధి కుక్కలను గాలికి వదిలేశారు. దీంతో తరచూ గ్రామసింహాల (కుక్కల) దాడులతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు.

కుక్కలు దాడి చేస్తాయిలా..

కుక్కల దాడి నుంచి తప్పించుకునేందుకు పెద్దలు శతవిధాలా ప్రయత్నిస్తారు. మరి చిన్నారుల పరిస్థితి దయనీయంగా ఉంటుంది. కుక్కల ఎత్తుకు పెద్దవారికైతే కాలి పిక్కలు పట్టి లాగుతాయి. పిల్లల ఎత్తుకు శునకాలు సమాంతరంగా ఉండడంతో ముఖం, మెడ, చెవి, వీపు భాగాల్లో దాడి చేస్తాయి. కాటేసిన శరీర భాగం, గాయం లోతు ఆధారంగా చికిత్సలకు సిఫార్సు చేస్తారు.

మే - జూలై మాసంలో కుక్కకాటు బాధితులు ఇలా ..

నియోజకవర్గం	కుక్కకాటు బాధితుల సంఖ్య
రాయదుర్గం	494
కళ్యాణదుర్గం	223
ఉరవకొండ	23

ఈ జాగ్రత్తలు పాటించండి

- మాంసం దుకాణాలు, హోటళ్ల వద్ద ఆహార వ్యర్థాలను సక్రమంగా నిర్వహించాలి.
- పెంపుడు కుక్కలకు రేబిస్ సోకకుండా ఏడాదికోసారి విధిగా టీకాలు ఇప్పించాలి.
- వీధి కుక్కలకు కూడా పురపాలిక, గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో టీకాలు ఇప్పించే కార్యక్రమాలు నిర్వహించాలి.
- అన్ని వీధుల్లో శునకాలు స్వైరవిహారం చేస్తున్నందున పిల్లలను ఒంటరిగా బయటకు పంపరాదు.
- నియంత్రణకు స్థానిక సంస్థలు పశు సంవర్ధక శాఖతో సమన్వయం చేసుకుని ప్రణాళికలు రూపొందించాలి.
- కుక్క కాటుకు గురైనప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చికిత్స విధానంపై అవగాహన పెంచాలి.



చర్యలు తీసుకుంటాం



రాయదుర్గం పట్టణంలోని కొన్ని ప్రాంతాల్లో కుక్కల సంతతి విస్తరించింది. వాటి కట్టడికి చర్యలు చేపట్టాం. ఏబీసీ కేంద్రానికి తరలించి కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయిస్తాం. ఒకేచోట గుంపుగా ఉండే వాటిని పట్టుకుని ఇతర ప్రాంతాలకు తరలిస్తాం. వర్షాకాలం కావడంతో ప్రజలు కుక్కల పట్ల కాస్త జాగ్రత్త వహించాలి. సాధ్యమైనంత వరకు రేబిస్ టీకాలు వేయడంతో పాటు ప్రధాన దారుల్లో గుంపులుగా చేరకుండా చర్యలు చేపడతాం.

– కిషోర్, మున్సిపల్ కమిషనర్, రాయదుర్గం

కుక్కకాటును నిర్లక్ష్యం చేయొద్దు



కుక్క కాటును నిర్లక్ష్యం చేయడం మంచిది కాదు. కరిచిన తక్షణం సమీప ఆస్పత్రుల్లో ప్రథమ చికిత్స చేయించుకుని టీకా వేయించుకోవాలి. ఇటీవల కుక్కల బెడద కొన్ని చోట్ల ఎక్కువైనట్టు కనిపిస్తోంది. ప్రజలు సాధ్యమైనంత వరకు వాటికి దూరంగా ఉండాలి. కుక్కల దాడుల్లోనూ నాలుగు రకాలు ఉంటాయి. అందులో నాకడం, గోకడం, కరవడం, గాయం చేయడం వంటివి ప్రమాదం. బాధితులకు టీకా వేస్తే ఉపశమనం కలుగుతుంది. 3, 7, 28 రోజుల్లో టీకా తప్పని సరిగా తీసుకోవాలి.

– డాక్టర్ సుజాత, వైద్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి, అనంతపురం

బాల్య వివాహాలతో అనర్థాలు

- ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి



మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి

రాయదుర్గం: బాల్య వివాహాలతో అనేక అనర్థాలు తలెత్తుతాయని, వీటి నిర్మూలనకు అందరూ కృషి చేయాలని ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి అన్నారు. బుధవారం రాయదుర్గం కేజీబీవీ కళాశాలలో ఎస్ఓ వెంకటలక్ష్మి అధ్యక్షతన బాల్య వివాహాల నిర్మూలన, చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పీడీతో పాటు సీడీపీఓ ప్రభావతి, ఎంపీడీఓ అల్లాబకాష్, డీవీ యాక్ట్ కౌన్సిలర్ ఉమాదేవి, లీగల్ ఆఫీసర్ సద్యారాణి, ఏఎస్ఈ మేనేజర్ శాంతామణి, ఎంఈఓ–1, 2 నాగమణి, వెంకటరమేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పీడీ మాట్లాడుతూ 17 అంశాలతో నిర్దేశించిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో రక్తహీనత రహిత భారత్ ఒకటన్నారు. 18 సంవత్సరాల్లోపు బాలికల్లో రక్తహీనత ఎక్కువగా ఉండడంతో వారికి వివాహాలు చేసినప్పుడు మాతృ మరణాలు సంభవిస్తామన్నారు. పుట్టిన శిశువు బరువు తక్కువగా ఉండడంతో మరణించే వారి సంఖ్య క్రమంగా పెరగడం వెలుగు చూస్తోందన్నారు. తల్లిదండ్రులు, ప్రజల్లో మార్పు వస్తేనే బాల్య వివాహాలు నిర్మూలించవచ్చన్నారు. బాలికలకు 18 ఏళ్లలోపు వివాహాలు జరిపించడం నేరమన్నారు. విద్యతోనే చైతన్యం సాధ్యమవుతుందన్నారు. ఎస్ఓ, డీటీ, ఎంఈఓలు మాట్లాడుతూ బాల్య వివాహాలు చేసే తల్లిదండ్రులతో పాటు ప్రోత్సహించే వారు సైతం శిక్షార్హులవుతారన్నారు. అన్ని రంగాల్లోనూ సత్తాచాటే శక్తి నారీమణులకు ఉందన్నారు. బాల్య వివాహం వల్ల శారీరకంగా, మానసికంగా కుంగిపోతారని పోస్టర్ ద్వారా వివరించారు. సమావేశంలో ఏఎస్ఐ బాస్కర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఈశ్వరమ్మ, నాగరత్న, అంజినమ్మ, కేజీబీవీ ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. అనంతరం ఉడేగోళంలోనూ బాల్యవివాహాల నిర్మూలనపై సదస్సు నిర్వహించారు.

ఘనంగా హజరత్ పీరాషావలి ఉరుసు



దర్గాలో ప్రత్యేక ఫాతెహా చేయిస్తున్న దృశ్యం



ఉరుసుకు పోటెత్తిన భక్తులు

కణేకల్లు: నియోజకవర్గంలోనే ప్రసిద్ధిగాంచిన యర్రగుంట హజరత్ పీరాషావలి ఉరుసు బుధవారం రాత్రి ఘనంగా జరిగింది. ఈ వేడుకలకు రాయదుర్గం, బళ్లారి, బొమ్మనహాళ్, గుంతకల్లు, ఉరవకొండ, కణేకల్లు, కళ్యాణదుర్గం తదితర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. హజరత్ పీరాషావలి సమాధిపై నూతన వస్త్రాలు, పూలచద్దర్ పరిచి మొక్కులు తీర్చుకున్నారు. పలువురు భక్తులు చక్కెరను తులాభారం చేసి మొక్కులు తీర్చుకోగా.. మరికొందరు భక్తులు ఆభరణాలు సమర్పించారు. వేడుకల్లో భాగంగా గురువారం వేకువజామున అశ్వంపై స్వామి వారి ప్రతిరూపంగా భావించే షంషీర్‌ను ఊరేగించనున్నట్లు ఆలయ ధర్మకర్త పూలరంగన్న, గ్రామపెద్దలు తెలిపారు. వేడుకల్లో దర్గా కమిటీ నిర్వాహకులు బండి రంగారెడ్డి, భీమలింగారెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, చిన్ననల్లారెడ్డి, హరినాథ్‌రెడ్డి, హనుమంతరెడ్డి, పెద్దనల్లారెడ్డిలు పాల్గొన్నారు. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఏఎస్ఐలు ఈశ్వరయ్య, శంకర్‌రెడ్డితో పాటు పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

నేడు పెన్నహోబిలంలో వేలంపాట

ఉరవకొండ: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిలం లక్ష్మీ నృసింహస్వామి ఆలయంలో తలనీలాల సేకరణ హక్కు, కొబ్బరి చిప్పలు సేకరించుకునేందుకు గురువారం వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఈఓ విజయ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు తలనీలాలు, కొప్పరి చిప్పల వేలం అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు బియ్యం, బేడల విక్రయ హక్కులకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ముగిసిన మొహర్రం



ఎర్రగుడిలో పీర్లను దర్శించుకుంటున్న భక్తులు

కూడేరు: మత సామరస్యానికి ప్రతీక అయిన మొహర్రం వేడుకలు కడదరకుంట, కూడేరు, అరవకూరు గ్రామాల్లో బుధవారం ప్రశాంతంగా ముగిశాయి. వేకువజామున పీర్లతో అగ్నిగుండ ప్రవేశం చేశారు. సాయంత్రం జలధి కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలు భక్తిశ్రద్ధలతో పీర్లను దర్శించుకున్నారు. పలువురు పిల్లలు, పెద్దలు డప్పుల నడుమ చిందులు తొక్కారు. ఎలాంటి గొడవలు జరగకుండా పోలీసులు చర్యలు చేపట్టారు

భక్తిశ్రద్ధలతో చిన్న మొహర్రం

బెళుగుప్ప: మండల పరిధిలోని ఎర్రగుడి గ్రామంలో బుధవారం చిన్న మొహర్రం వేడుకలు నిర్వహించారు. పీర్లచావిడి వద్ద పీర్లస్వాములకు చక్కెర చదివింపులు చేయించారు. తెల్లవారుజామున ప్రత్యేక ప్రార్థనలతో అగ్నిగుండ ప్రవేశం చేశారు. సాయంత్రం భక్తజనసందోహం మధ్య అగ్నిగుండం వద్ద ముజావర్‌లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం పీర్లను జలధికి తరలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ శివ పోలీస్ సిబ్బందితో బందోబస్తు చేపట్టారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం



మాట్లాడుతున్న ఎంపీపీ పెద్దన్న

బెళుగుప్ప: గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా మండల అధికారులు కృషి చేయాలని ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ సుబ్బరాజు ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. నూతన ప్రభుత్వం ఏర్పడిన తరువాత జరిగిన తొలిసర్వ సభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సభలో విన్నవించారు. ప్రధానంగా వ్యవసాయశాఖ అధికారులు ప్రత్యామ్నాయ పంటల సాగుకు విత్తన సరఫరా, గత రబీ పంట నష్టం విడుదల, సబ్సిడీ యాంత్రీకరణ వ్యవసాయ పనిముట్లు, డ్రిప్ మంజూరు తదితర అంశాలను లేవనెత్తారు. నూతన బాలికల వసతి గృహం మంజూరు, పండ్ల తోటల విస్తరణ సబ్సిడీ వినియోగంపై చర్చించారు. శీర్పి, హనిమరెడ్డిపల్లి గ్రామాల్లో తరగతి గదులు శిథిలావస్థకు చేరాయని పలువురు తెలిపారు. బూదిగుమ్మ వద్ద పెన్నానదిపై బ్రిడ్జ్ నిర్మాణానికి సంబంధించిన ప్రగతి నివేదికను రూ.50 కోట్లతో ప్రభుత్వానికి పంపామని ఆర్‌అండ్‌బీ జేఈ కావ్య పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పుష్పావతి, డీటీ పీరా, ఏఓ పృథ్వీసాగర్, హెచ్ఓ కృష్ణతేజ, హౌసింగ్ ఏఈ శివారెడ్డి, మండల పరిషత్ ఏఓ దామోదర్, సర్పంచులు, ఎంపీటీసీలు, కో–ఆప్షన్ సభ్యులు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సకాలంలోనే ఆయకట్టుకు నీరు



గంగపూజ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

బొమ్మనహాళ్: తుంగభద్ర జలాశయంలోకి ఊహించని విధంగా వరద వస్తున్నందున ఆయకట్టుకు సకాలంలోనే నీరు విడుదల చేయనున్నట్లు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తెలిపారు. బుధవారం బొమ్మనహాళ్ మండలంలోని ఆంధ్ర సరిహద్దు 105వ కిలోమీటర్ వద్ద హెచ్చెల్సీలో ప్రవహిస్తున్న తుంగభద్ర జలాలకు అధికారులు, ఆయకట్టు రైతులతో కలిసి ఎమ్మెల్యే గంగపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా కాలవ మాట్లాడుతూ తుంగభద్ర డ్యాం నుంచి మన వాటాగా 26 టీఎంసీలకు పైగా నీరు వస్తుందని, ఇంకా అదనంగా నీరు తేవడానికి కూడా తాము ప్రయత్నిస్తామని చెప్పారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ బలరామిరెడ్డి, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యాక్షులు కొండాపురం కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కలసికట్టుగా ప్రజలకు సేవ చేద్దాం

బొమ్మనహాళ్: రాజకీయాలకు అతీతంగా అధికారులు, ప్రజాప్రతినిధులు కలసికట్టుగా ప్రజలకు సేవ చేద్దామని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు సూచించారు. భూకబ్జాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బుధవారం బొమ్మనహాల్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పద్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వ్యవసాయ, విద్యా, విద్యుత్, ఎన్ఆర్‌జీఎస్ శాఖలపై చర్చించారు. మండలంలో బడి మానేసిన పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి బడిలో చేర్పించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. బాల్యవివాహాల్లో రాష్ట్రంలోనే ఈ మండలం మొదటి స్థానంలో ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. బాల్యవివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రఘునాథ్, ఈఓపీఆర్‌డీ దాస్, ఉద్యాన శాఖాధికారి మౌనిక, ఏఓ సాయికుమార్, పశువైద్యాధాకారి వెంకట్‌రెడ్డి, ఎంఓఈలు వీరన్న, మల్లికార్జున, జేఈఈ జగదీష్, చైతన్య, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఉరగాద్రి చౌడేశ్వరి ఆలయ చైర్మన్‌గా శరత్



ఉరవకొండ: పట్టణంలోని కెనరా బ్యాంక్ ఎదురుగా ఉన్న ఉరగాద్రి చౌడేశ్వరి ఆలయ చైర్మన్‌గా కొత్త శరత్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 4న ఉరగాద్రి చౌడేశ్వరి ఆలయంలో అమ్మవారి జయంతి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహిస్తామన్నారు. ఇప్పటికే జయంతి కోసం భారీ ఏర్పాట్లు చేపట్టామన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా వసతులు కల్పిస్తామన్నారు. కాగా.. గతంలో ఆలయ చైర్మన్‌గా ఉన్న కొత్త శ్రీనివాసులు అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే.

కొత్త చట్టాలపై అవగాహన

గుమ్మఘట్ట: కొత్త చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఏఎస్ఐ రమణ తెలిపారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ముందు గ్రామ ప్రజలకు కొత్త చట్టాలపై అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన చట్టాలు అమలులోకి వచ్చాయని, ప్రతి ఒక్కరూ వాటికి లోబడి ఉండాలని తెలిపారు.

పింఛన్ల పంపిణీ పారదర్శకంగా చేయాలి

గుమ్మఘట్ట: సామాజిక భద్రత పింఛన్లు పారదర్శకంగా పంపిణీ చేయాలని ఎంపీడీఓ గౌరీదేవి తెలిపారు. మండల వ్యాప్తంగా 6,204 మంది లబ్ధిదారులకు ఇంటి వద్దనే పింఛన్లు పంపిణీ చేయాలని సచివాలయాల సిబ్బందికి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయాల సిబ్బదితో ఆమె సమావేశం నిర్వహించారు. పింఛన్ల పంపిణీని రెండు రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు.

గొర్రెల యూనిట్ తనిఖీ

కూడేరు: నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ పథకం కింద కూడేరుకు చెందిన రామానాయుడికి గొర్రెల పెంపకం యూనిట్ మంజూరైంది. బుధవారం పశుసంవర్ధక శాఖ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ (డీడీ) రమేష్ రెడ్డి గొర్రెల పెంపకం యూనిట్‌ను తనిఖీ చేశారు. నిబంధనల మేరకు గొర్రెల పెంపకానికి అనుగుణంగా షెడ్ ఏర్పాటు చేశారా లేదా అని క్షుణ్ణంగా పరిశీలించారు. కార్యక్రమంలో ఏడీ సురేష్, అనిమల్ అజ్బెండరీ అసిస్టెంట్లు (ఏహెచ్ఏ) దామోదర్, రఘువర్ధన్, రాఘవయ్య పాల్గొన్నారు.

ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి

వజ్రకరూరు: విద్యార్థులు ఆరోగ్య జాగ్రత్తలు తప్పక పాటించాలని సర్పంచ్ మల్లెల జగదీష్, గడేహోతురు పీహెచ్‌సీ వైద్యాధికారి మారుతి సూచించారు. బుధవారం మండలంలోని చాబాల గ్రామంలోని సాంఘిక సంక్షేమ హాస్టల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నతస్థాయికి చేరుకోవాలన్నారు. అనంతరం సీజనల్ వ్యాధులు, డయేరియా, లెప్రసీ, చేతుల పరిశుభ్రత తదితర అంశాలపై వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ ధనుంజయ, ఏఎస్ఎం ఇందిరా, ఎంఎల్‌హెచ్‌పీ పావని పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలలపై కొరడా



స్టోర్ రూమును సీజ్ చేస్తున్న ఎంఈఓ నాగమణి

రాయదుర్గం టౌన్: ప్రైవేటు పాఠశాలల్లో నిబంధనలకు విరుద్ధంగా నోట్ పుస్తకాలు, యూనిఫాం, ఇతర మెటీరియల్ విక్రయాలపై ఎంఈఓ–1 నాగమణి, ఎంఈఓ–2 వెంకటరమేష్ కొరడా ఝుళిపించారు. ఫిర్యాదుల నేపథ్యంలో పట్టణంలోని సెయింట్ పాల్స్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్, నారాయణ స్కూల్‌ను తనిఖీ చేశారు. నోట్ పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు, యూనిఫాం విక్రయిస్తుండడంతో ఆయా స్కూళ్లలోని స్టోర్ రూములను సీజ్ చేసి, యాజమాన్యాన్ని హెచ్చరించారు.

వైభవంగా ఏకాదశి పూజలు

బొమ్మనహాళ్: ఉంతకల్లు రుక్మిణీ పాండురంగ స్వామికి బుధవారం ఏకాదశి పూజలు అత్యంత వైభవంగా జరిగాయి. ఆంధ్ర, కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాల నుంచి తులసి మాల ధారణకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తుల సమక్షంలో రాత్రి పల్లకీ మహోత్సవం నిర్వహించారు.

నేడు మంత్రి పర్యటన

కూడేరు: అంతరగంగ గ్రామంలో గురువారం ఉదయం 9 గంటలకు మంత్రి పయ్యావుల కేశవ్ పర్యటించనున్నట్లు నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాసులు తెలిపారు. సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ చేస్తారన్నారు.

ఉపాధ్యాయుడికి వీడ్కోలు

బెళుగుప్ప: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడు సి.కొండారెడ్డి ఉద్యోగ విరమణ చేశారు. బుధవారం పాఠశాలలో హెచ్ఎం వెంకటప్రసాద్ అధ్యక్షతన సి.కొండారెడ్డి దంపతులను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓలు మల్లారెడ్డి, హరికృష్ణ, ఎంపీపీ పెద్దన్న, వైస్ ఎంపీపీ పుష్పావతి తదిరులు పాల్గొన్నారు.

హెచ్ఎంకు సన్మానం

కుందుర్పి : స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం కిష్టప్ప బుధవారం ఉద్యోగ విరమణ చేయడంతో పాఠశాలలో ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే సురేంద్రబాబు, వాల్మీకి నాయకులు హెచ్ఎం సేవలను కొనియాడారు. అనంతరం ఆయన్ను గ్రామంలో మేళతాళాల నడుమ ఊరేగించారు. జెడ్పీటీసీ రాధాస్వామి, ఎంపీపీ నాగరాజు, వైఎస్సార్‌సీపీ నేత సత్యనారాయణశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

రికార్డులు పక్కాగా ఉండాలి

వజ్రకరూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లో రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ పద్మ సూచించారు. బుధవారం మండల పరిధిలోని వెంకటాంపల్లి పెద్దతండా (రూపానాయక్ తండా)లోని 1, 2 అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, పౌష్టికాహారం పంపిణీపై ఆరా తీశారు.

పాతిరెడ్డి సేవలు ప్రశంసనీయం

కళ్యాణదుర్గం రూరల్: ఉపాధ్యాయుడు పాతిరెడ్డి సేవలు ప్రశంసనీయమని వక్తలు పేర్కొన్నారు. పాతిరెడ్డి ఉద్యోగ విరమణ సందర్భంగా నారాయణపురంలోని ప్రభుత్వ పాఠశాలలో సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా వక్తలు పాతిరెడ్డి సేవలను కొనియాడారు. అనంతరం పాతిరెడ్డి దంపతులను సత్కరించారు.